నమస్తే తెలంగాణ

# కామారెడ్డి

5 | నిజామాబాద్, శనివారం 31 మే 2025 | KAMAREDDY

## డెడ్ స్టోరేజీకి పోచారం ప్రాజెక్టు



నాగిరెడ్డిపేట్, మే 30: మండలంలోని పోచారం ప్రాజెక్టులో నీటి నిల్వలు గణనీయంగా తగ్గిపోయాయి. ప్రస్తుతం నీళ్ల లేక బోసిపోతున్నది.ఈ ఏడాది నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి మండలాలకు వానకాలం, యాసంగి పంటలకు సాగు, తాగునీరు అందించిన ప్రాజెక్టు.. నేడు నీరు లేక డెడ్ స్టోరేజీకి చేరుకున్నది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 1.82 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.231 టీఎంసీలతో డెడ్ స్టోరేజీలో ఉన్నది. ఈసారి నెల ముందుగానే వర్షాలు కురుస్తుండడంతో ప్రాజెక్టు జలకళ సంతరించుకుంటుందని రైతులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

## ఎస్సారెస్పీలోకి 2,315 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మోర్తాడ్, మే 30: నిజామాబాద్ జిల్లాలోని మెండోరా మండలంలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో 12.672 టీఎంసీల నీటినిల్వ ఉన్నట్లు అధికారులు శుక్రవారం తెలిపారు. ప్రాజెక్ట్‌లోకి ఎగువప్రాంతం నుంచి 2,315 క్యూసెక్కుల వరద వస్తున్నట్లు తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు (80.5టీఎంసీలు)కాగా ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 1062.10 అడుగుల (12.672 టీఎంసీలు) నీటి నిల్వ ఉన్నదని పేర్కొన్నారు. కాకతీయ కాలువకు 100 క్యూసెక్కులు, మిషన్ భగీరథ తాగునీటి కోసం 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, 341 క్యూసెక్కుల నీరు ఆవిరిరూపంలో వెళ్తున్నదని తెలిపారు.

## జీపీవో ఫలితాలు విడుదల

- ఉమ్మడి జిల్లాలో అర్హత సాధించిన 508 మంది
- నిజామాబాద్‌లో 231మంది, కామారెడ్డిలో 277 మంది




ఖలీల్‌వాడి/ కామారెడ్డి, మే 30: గ్రామ పాలనాధికారుల ఫలితాలు విడుదలయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా జీపీవో ఉద్యోగాలకు నిర్వహించిన పరీక్షా ఫలితాలు, అభ్యర్థుల ర్యాంకింగ్ జాబితాను ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసింది. గ్రామపాలనాధికారుల నియామకం కోసం ఈ నెల 25న అర్హత పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. నిజామాబాద్ జిల్లాలో మొత్తం 332 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 302 మంది పరీక్షకు హాజరయ్యారు. ఇందులో 231 మంది (76.49 శాతం) అర్హత సాధించారు. కామారెడ్డిలో మొత్తం 401 మంది దరఖాస్తు చేసుకోగా 377 మంది పరీక్ష రాశారు. 277 మంది (72శాతం) అర్హత సాధించారు. అభ్యర్థుల ధ్రువ ప త్రాల పరిశీలన చేపట్టనున్నారు.





### 63 కార్డులు మాత్రమే..

నిజామాబాద్ జిల్లాలో కొత్తగా రేషన్ కార్డుల జారీ ప్రక్రియను పరిశీలిస్తే ముక్కున వేలేసుకోవాల్సిందే. ఈ నెల మొదటి వారం వరకు జారీ చేసిన కొత్త కార్డుల సంఖ్య కేవలం 63 మాత్రమే. అవి కూడా ప్రజాపాలన గ్రామసభల్లో భాగంగా కొద్ది మందికి ఏదో నామమాత్రంగా అందించారు. ఇక, పాత రేషన్ కార్డుల్లో పేర్ల నమోదుకు దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య లక్షల్లో ఉండగా, కేవలం 4 వేల మందికే మోక్షం లభించింది. నిజామాబాద్ జిల్లాలో గత ఏప్రిల్ వరకు 4,02,154 రేషన్ కార్డులుండగా, ఆ సంఖ్య మే నెల మొదటి వారానికి 4,02,217కు చేరింది. 17 నెలల ప్రజాపాలనలో జిల్లా వ్యాప్తంగా వేలాది దరఖాస్తులు రాగా, 67 మందికే కొత్త రేషన్ కార్డులు అందించారు. మిగిలిన దరఖాస్తులు పరిశీలనలో ఉన్నట్లు చెబుతున్నారు. రెవెన్యూ అధికారులే స్వయంగా దరఖాస్తుదారుల చెంతకు వెళ్లి వివరాలను పరిశీలన చేస్తున్నారు. ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో డాటాను పొందుపర్చి వివరాలను ప్రభుత్వానికి చేరవేస్తున్నారు. ఏప్రిల్, 2025 నాటికి జిల్లాలో మొత్తం 13,10,012 మంది రేషన్ లబ్ధిదారులు ఉండగా, ఇప్పుడా ఈ సంఖ్య 13,14,465కు చేరింది. పాత రేషన్ కార్డుల్లో కొత్తగా పేర్లు చేర్చిన వారి వివరాలు 4453 మందికి మోక్షం లభించింది.

# కొత్త కార్డుల కథ.. అంతులేని వ్యథ




నిజామాబాద్, మే 30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కొత్త రేషన్ కార్డుల కథ డంపింగ్ యార్డుకు చేరినట్లు కనిపిస్తున్నది!. సర్వే ప్రక్రియలో తీవ్ర జాప్యంపై దరఖాస్తుదారుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతున్నది. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానించింది. అలాగే, గ్రామసభల సమయంలోనూ మళ్లీ అప్లికేషన్లు స్వీకరించింది. దాదాపు ఏడాదిన్నర గడిచినా దరఖాస్తులకు మోక్షం లభించలేదు. కొత్త రేషన్ కార్డుల జారీ మొదలు కాలేదు. దీంతో సర్కారు తీరుపై లబ్ధిదారులు నిట్టూరుస్తున్నారు.

- సర్వే ప్రక్రియలో తీవ్ర జాప్యం
- రేవంత్ సర్కారు మాటలకు, చేతలకు భారీ తేడా
- ప్రభుత్వ తీరుపై దరఖాస్తుదారుల్లో తీవ్ర అసహనం
- 63 మందికి మాత్రమే కొత్త కార్డులు జారీ
- పాత రేషన్ కార్డుల్లో 4,453 పేర్లు మాత్రమే నమోదు
- నిజామాబాద్‌లో 4,02,217కు చేరిన రేషన్ కార్డుల సంఖ్య

### చెప్పిందొకటి.. చేస్తున్నదొకటి..!

అధికారం కోసం కాంగ్రెస్ నోటికొచ్చిన హామీలిచ్చింది. వాటి అమలు సాధ్యమా.. లేదా? అన్నది పట్టించుకోకుండా వరాలు కురిపించింది. ఆరు గ్యారంటీల్లో భాగంగా అనేక హామీలు గుప్పించిన కాంగ్రెస్.. గద్దెనెక్కాక ఏ ఒక్కటీ పూర్తిగా అమలు చేయలేక చేతులెత్తేసింది. రుణమాఫీ, రైతుభరోసా అరకొరగానే అమలు చేసింది. కల్యాణలక్ష్మి కింద ఇస్తామన్న తులం బంగారం హామీ మాయమైపోయింది. పింఛన్ల పెంపు, మహిళందరికీ పెన్షన్లు, యువతులకు స్కూటీలు.. ఇలా ఎన్నింటినో రేవంత్ సర్కారు అటకెక్కించింది. ఇక రేషన్ కార్డుల విషయంలోనూ ప్రభుత్వం అలాగే వ్యవహరిస్తున్నది. ఏడాదిన్నర దాటుతున్నా రేషన్ కార్డుల జారీని పూర్తి చేయలేదు. నిరంతర ప్రక్రియగా చేపడుతామని చెప్పినప్పటికీ, ఆ ప్రక్రియే మొదలు కాలేదు. దీంతో లబ్ధిదారులు సర్కారు తీరుపై దుమ్మెత్తి పోస్తున్నారు.

### తలకు మించిన పని భారం..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారులపై తలకు మించిన భారం మోపింది. వివిధ పథకాల అమలు, పర్యవేక్షణను రెవెన్యూ అధికారులకే అప్పగించింది. దీంతో వారు రేషన్ కార్డుల పరిశీలనను వేగవంతం చేయలేక పోతున్నారు. ధరణి స్థానంలో ఏప్రిల్ 14న భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిన ప్రభుత్వం దానిపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించింది. దీంతో భూ భారతి సదస్సుతో రెవెన్యూ వర్గాలు బిజీగా మారాయి. మొన్నటిదాకా రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తులు ఆహ్వానించగా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల జారీలో రెవెన్యూ వర్గాలు తలామునకలయ్యాయి. ఈ క్రమంలో ఒక్కో మండలానికి సుమారుగా 30 వేల నుంచి 50వేల వరకు దరఖాస్తులు రాగా, వాటిని క్షేత్ర స్థాయికి వెళ్లి పరిశీలించడం అధికారులకు తలకు మించిన భారంగా మారింది. మరోవైపు, ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం నెలకొనడంతో రెవెన్యూ యంత్రాంగాన్ని పురామయించారు. ఇలా రెవెన్యూ అధికారులు వివిధ పని ఒత్తిళ్లలో ఉన్న తరుణంలో దరఖాస్తుల పరిశీలన, సర్వే ప్రక్రియలో జాప్యం నెలకొంది. ఈ సమస్యను ప్రభుత్వం గుర్తించడం లేదు. పరిష్కారానికి చొరవ తీసుకోవడం లేదు. ఫలితంగా రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న వారికి నెలల తరబడి నిరీక్షణ తప్పడం లేదు. మరోవైపు, కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో చాలా మంది పాత రేషన్ కార్డు నుంచి పేర్లను తొలగించుకున్నారు. తద్వారా రెంటికి చెడ్డ రేవడి అన్నట్లు వారి పరిస్థితి తయారైంది.

## చెరుకు, వరిలో నూతన వంగడాలు

- రుద్రూర్ శాస్త్రవేత్తల మరో విజయం
- విత్తన పరిశోధనలో ముందడుగు
- జూన్ 3న విత్తన మేళా
- కేవీకే, వరి పరిశోధనా స్థానం అధిపతి అంజయ్య

రుద్రూర్, మే 30: రుద్రూర్ శాస్త్రవేత్తలు విత్తన పరిశోధనలో మరో ముందడుగు వేశారు. చెరుకు, వరిలో నూతన వంగడాలను కనుగొన్నారని కృషి విజ్ఞాన కేంద్రం, వరి-చెరుకు పరిశోధనా స్థానం అధిపతి డాక్టర్ అంజయ్య తెలిపారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని వరి చెరుకు పరిశోధనా స్థానంలో శాస్త్రవేత్తలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. శాస్త్రవేత్తలు మూడు నూతన వంగడాలను రైతులు ముందుకు తీసుకొచ్చి అద్భుత విజయాన్ని సాధించారని అన్నారు. మారుతున్న కాలానికనుగుణంగా నూతన వంగడాలను కనుగొని, ఎప్పటికప్పుడు రైతులకు అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. తెగుళ్ల నుంచి తట్టుకునే నూతన చెరుకు రకాన్ని (ఆర్‌డీఆర్ 81) రైతులకు అందుబాటులోకి తెచ్చారని తెలిపారు. ఈ రకం చెరుకు సాగునీరు అందుబాటులో ఉన్న ప్రాంతాలకు అనుకూలమని పేర్కొన్నారు. ఎర్రకుళ్ల, కొరడా తెగులు, పసుపు ఆకు తెగులుని తట్టుకుంటుందని వివరించారు. అంతేకాకుండా పీక పురుగు, కాండం తొలుచు పురుగు, పొలుసు పురుగును కూడా తట్టుకుంటుందని పేర్కొన్నారు.

**వరిలో రెండు రకాల నూతన వంగడాలు**

వరిలో కూడా రెండు రకాల నూతన వంగడాలను రైతులకు అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. జగిత్యాల్ సాంబ, నెల్లూరి మసూరి అనే రకాలను సంకరపరిచి ఆర్‌డీఆర్-1200 రకాన్ని కొనుగొన్నట్లు పేర్కొన్నారు. అధిక దిగుబడినిచ్చి, తెగుళ్ల నుంచి తట్టుకునే శక్తి కలిగిన వంగడాన్ని కనుగొన్నారని తెలిపారు. తక్కువ నూక శాతం కలిగి ఉండి నాణ్యతగా ఉంటుందని పేర్కొన్నారు. రెండోది ఆర్‌డీఆర్1162 అనే స్వల్పకాలిక రకం 2024లో విడుదల చేసినట్లు తెలిపారు. ఈ రకం రెండు కాలాలకు అనువైనదని, వానకాలంలో120, యాసంగిలో130రోజుల్లో పంట చేతికి వస్తుందని పేర్కొన్నారు. ఈ రకాన్ని జేజీఎల్11727, జేజీఎల్17004 రకాలను సంకరపరిచి కొనుగొన్నట్లు వివరించారు. జూన్2న ప్రతి గ్రామంలో ముగ్గురు లేదా నలుగురు రైతులకు ఉచితంగా విత్తనాలను పంపిణీ చేస్తామని తెలిపారు. జూన్ 3న కేవీకే, వరి పరిశోధనా స్థానం ఆధ్వర్యంలో విత్తన మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ అంజయ్య

## క్రీడా మైదానమా.. శ్మశాన ప్రాంగణమా!




బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రతి మండలంలో క్రీడా మైదానాలను ఏర్పాటు చేసింది. ఇందులోభాగంగా మోస్రా మండల కేంద్రంలోనూ తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయగా..ప్రస్తుతం నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. శ్మశాన వాటిక పక్కనే క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారు. కనీసం అడ్డుగోడ కూడా ఏర్పాటు చేయకపోవడంతో క్రీడాకారులు, విద్యార్థులు అక్కడికి వచ్చి ఆడుకోవాలంటేనే భయపడుతున్నారు. క్రీడాప్రాంగణం మొత్తం పిచ్చిమొక్కలు, ముళ్లపొదలతో అధ్వానంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి క్రీడా మైదానాన్ని అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

-స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

## స్త్రీనిధి లక్ష్యం నెరవేరేనా?

- రుణ లక్ష్యం రూ.246 కోట్లు
- వివిధ వ్యాపారాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మోర్తాడ్, మే 30: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించడానికి ప్రభుత్వం స్త్రీనిధి ద్వారా రుణాలను మంజూరుచేస్తున్నది. ప్రతిఏటా లక్ష్యాన్ని మహిళా సంఘాలు సాధ్యం చేసుకుంటున్నప్పటికీ ఈసారి నెరవేరుతుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్త్రీనిధి రుణాలతో పాటు బ్యాంకులింకేజీ రుణాలకు లక్ష్యం నిర్దేశించిన లక్ష్యం మేరకు ఐకేపీ ఆధ్వర్యంలో మహిళా సంఘాలను ప్రోత్సహిస్తూ లక్ష్యాలను నెరవేరుస్తున్నారు. రాష్ట్రస్థాయిలో ముందంజలో నిలుస్తున్న జిల్లాలో ఈసారి కూడా నిర్ణయించిన లక్ష్యాన్ని చేరుకుంటారా అనే దానిపై ఆసక్తి నెలకొన్నది. గతేడాది జిల్లాకు స్త్రీనిధి లక్ష్యం రూ.211 కోట్లు కాగా రూ.216 కోట్ల వరకు మహిళాసంఘాలకు రుణాలు వివిధ వ్యాపారాల కోసం అందజేశారు. అయితే ఈ సంవత్సరం స్త్రీనిధి రుణ లక్ష్యం రూ.246కోట్లుగా అధికారులు నిర్ణయించారు.

**వ్యాపారాలపై అవగాహన కల్పిస్తూ..**

జిల్లాలో మహిళాసంఘాల సభ్యులకు వ్యాపారాలపై అవగాహన కల్పిస్తూ వారిని ఐకేపీ ఆధ్వర్యంలో ప్రోత్సహిస్తున్నారు. ఇప్పటికే స్త్రీనిధి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా సంఘ సభ్యులతో వ్యాపారాలు ఏర్పాటు చేయించారు. ఇందులో ముఖ్యంగా టెంట్‌హౌస్‌లు, పిండివంటల తయారీ, కిరాణదుకాణాలు, బట్టల దుకాణాలు, క్యాంటీన్‌లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఇలా ప్రాంతాన్ని బట్టి మహిళలతో వ్యాపారాలు ఏర్పాటు చేయించారు. ఇప్పుడు కూడా అదే విధంగా గ్రామాలు, మండల కేంద్రాల్లో వ్యాపారాలు ఏర్పాటు చేయించేందుకు ప్రణాళికను సిద్ధం చేసుకుంటున్నారు. కానీ గ్రామీణ ప్రాంతాల్లో వ్యాపారాలు అంతంతే కొనసాగుతున్న నేపథ్యంలో ఒక సంఘానికి కేవలం రూ.5లక్షల వరకు మాత్రమే వడ్డీ రాయితీ వచ్చే అవకాశం ఉండడం, మిగతా మొత్తానికి వడ్డీ చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి కారణాలతో ఈసారి లక్ష్యం చేరుకుంటారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు మహిళాసంఘాలతో సమావేశాలు నిర్వహిస్తూ వారిలో ఆసక్తి ఉన్నవారిని గుర్తించి వ్యాపారాలు ఏర్పాటు చేసేలా ప్రయత్నాలు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.



మహిళా సంఘాలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

## వక్ఫ్‌చట్ట సవరణ బిల్లును రద్దుచేయాలి

### బాన్సువాడలో ముస్లింల ర్యాలీ

బాన్సువాడ, మే 30: కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదించిన వక్ఫ్ సవరణ బిల్లును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బాన్సువాడలో ముస్లిములు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం తాడ్కోల్ చౌరస్తా వద్ద మానవహారం నిర్మించారు. ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ వందల ఏండ్ల నుంచి అమలులో ఉన్న వక్ఫ్ చట్టాన్ని సవరించడం ముస్లింలకు నష్టం చేకూర్చేలా ఉందన్నారు. వెంటనే చట్టసవరణ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వాహబ్, మహ్మద్ ఎజాస్, తన్నూ, రియాజ్, సలీం తదితరులు పాల్గొన్నారు.




బాన్సువాడలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిములు